

స్కిట్ ను పరిశీలించిన జేఎన్టీయూ ప్రతినిధి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



జేఎన్టీయూ అనుబంధ శ్రీకాళహస్తీశ్వర ఇంజనీరింగ్ కళాశాలను కలికిరి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు జేఎన్టీయూ ప్రతినిధిగా బుధవారం పరిశీలించారు. స్కిట్ కళాశాలలో చేరే విద్యార్థులకు ఎలాంటి సదుపాయాలు, పరికరాలు అందుబాటులో ఉన్నాయో ఆరా తీశారు. ఎంసెట్ మూడో కౌన్సిలింగ్ చేపట్టిందనీ, జేఎన్టీయూ పరిధిలోని నాలుగు కళాశాలల్లో ఎలాంటి ఉన్నత విద్యా ప్రమాణాలు, మెరుగైన వసతి సదుపాయాలు ఉంటాయో అదే ప్రమాణాలు స్కిట్ లోనూ పాటించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు పోకుండా స్కిట్ లో అడ్మిషన్లు తీసుకోవాలని సూచించారు. నివేదికను జేఎన్టీయూ ఉన్నత విభాగానికి నివేదించనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ దేవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

ముక్కంటి 'చెంత'



భ్రూణహత్యల 'చింత'



యథేచ్ఛగా లింగనిర్ధారణ పరీక్షలు
ఆడ నలుసు అమ్మగర్భంలోనే అంతం

వెయ్యికి 629 మందే బాలికలు
ఆందోళనకరంగా 'లింగ' నిష్పత్తి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో బాలికల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది.. వెయ్యికి 629 మందే బాలబాలికల నిష్పత్తి ఉండటం ఆందోళన కలిగించే అంశం.. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం బాల బాలికల నిష్పత్తి దారుణంగా పడిపోతుండటం మరింత ఆందోళన కలిగించే అంశం. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి అడ్వయిజర్స్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టరే ఈ అంశాన్ని బహిర్గతం చేయడం గమనార్హం. ఆరేళ్లలోపు బాలల్లో బాలికలు అతి తక్కువగా ఉన్న మండలాల్లో తొట్టంబేడు, శ్రీకాళహస్తి, ఏర్పేడుఉన్నట్లు సమాచారం. మూడు నెలల కిందట స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జరిగిన అడ్వయిజరీ కమిటీ సమావేశంలో సైతం ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి ఇదే అంశాన్ని లేవనెత్తారు. అయినా వైద్యాధికారుల్లో ఎలాంటి చలనం లేకపోవడంతో పెద్ద ఎత్తున భ్రూణ హత్యలు చోటు చేసుకున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ లింగ ఎంపిక నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్న నిబంధనను అధికార యంత్రాంగం ఆచరణలో పెట్టకపోవడంతో ఆడ నలుసు అమ్మ గర్భంలోనే అంతమైపోయే పరిస్థితి ఏర్పడింది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఆడ-మగ నిష్పత్తి వెయ్యికి తొమ్మిది వందలు ఉండగా శ్రీకాళహస్తిలో మాత్రం వెయ్యికి 629 మంది ఆడ బిడ్డలే ఉండటం ఇందుకు నిలువెత్తు నిదర్శనం.

జనగణన 2018 ప్రకారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వెయ్యిమంది బాలురకు 922 మంది బాలికలు ఉన్నారు. అదే 2021 లెక్కలకొచ్చేసరికి ఈ సంఖ్య 901కి పడిపోయింది. జిల్లాల విభజన అనంతరం 2024లో జరిగిన జనగణన లెక్కల ప్రకారం తిరుపతి జిల్లాలో బాలికల సంఖ్య స్వల్పంగా పెరిగి 916కు చేరింది. అయితే శ్రీకాళహస్తిలో మాత్రం జిల్లా నిష్పత్తికి వ్యతిరేకంగా నానాటికీ బాలికల నిష్పత్తి తగ్గుతూ వస్తుంది. బాలురు - బాలికల నిష్పత్తిలో తీవ్ర వ్యత్యాసం నమోదైన ప్రాంతాలపై అధికారులు ప్రత్యేకంగా దష్టి సారించాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రభుత్వ విభాగాలను భాగస్వామ్యం చేసి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తేనే బాలికల నిష్పత్తి పడిపోకుండా ఆపగలమని మేధావులు సూచిస్తున్నారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో తొలి సంతానం మగబిడ్డ పుట్టగానే కుటుంబ నియంత్రణ పాటిస్తున్న కుటుంబాలు ఎక్కువగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. లేకుంటే పిండ దశలోనే చిధి మేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

శ్రీకాళహస్తి, నాయుడుపేట, గూడూరుల్లో...

శ్రీకాళహస్తి ప్రాంతంలో బాలికల నిష్పత్తి లింగ నిర్ధారణ పరీక్షల కారణంగానే గణనీయంగా తగ్గిపోతుందన్న విమర్శలు వస్తున్నాయి. శ్రీకాళహస్తి పట్టణంలోని కొన్ని స్కానింగ్ కేంద్రాలు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో లింగ నిర్ధారణ పరీక్షకు రూ. 15 నుంచి రూ. 20 వేలు ఫీజులు తీసుకుంటున్నట్లుగా చెప్పుకుంటున్నారు. అదేవిధంగా నాయుడుపేట, గూడూరు కేంద్రంగా లింగ నిర్ధారణ పరీక్షలు పెద్ద ఎత్తున జరుగుతున్నట్లు సమాచారం. గూడూరు పట్టణంలోని పేరుగాంచిన ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వైద్యులు, స్కానింగ్ కేంద్రాలు నడుపుతున్న నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షల పేరుతో కోట్లు గడిస్తున్నారని చెప్పుకుంటున్నారు. ఆ ఫలితమే భ్రూణ హత్యలకు కారణమవుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య యంత్రాంగం అప్రమత్తమై ప్రైవేటు నర్సింగు హోముల్లో, స్కానింగ్ సెంటర్లలో విరివిగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గ్యాస్ పైప్ లైన్ పేరుతో...

రోడ్లకు తూ(పో)ట్లు..!

పట్టణమంతా గుంతలమయం
పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - నాయుడుపేట





గ్యాస్‌పైప్ లైన్ పేరుతో గత ఐదు సంవత్సరాలుగా రోడ్లను ఇష్టానుసారంగా తూట్లు పొడుస్తూ ధ్వంసం చేస్తున్నారు. అయితే మున్సిపల్ అధికారులు గానీ, రాజకీయ నాయకులు గానీ అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఐదేళ్ల క్రితం లోడిన రోడ్లను ఇంతవరకూ పూడ్చలేదంటే కార్పొరేట్ల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. తవ్విన రోడ్డును పూడ్చడం కాంట్రాక్టర్ సామాజిక బాధ్యత. అయితే ఆ బాధ్యతను విస్మరిస్తున్న గ్యాస్ పైప్‌లైన్ కాంట్రాక్టర్‌పై 'స్థానిక' నేతలకు ఎందుకంత ప్రేమో అర్థం కావడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలో గత ఐదేళ్లుగా ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే ఎక్కడబడితే అక్కడ ఇష్టానుసారంగా ప్రభుత్వ స్థలాలు కార్పొరేట్ల సొంతమన్నట్లుగా తవ్వేస్తూ గుంతలు గుంతలుగా తవ్వి వదిలేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి గ్యాస్ పైప్‌లైన్ సంస్థ వారు పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే గాంధీ పార్కు వద్ద వాహనాలకు దారి లేకుండా దాదాపు 300 మీటర్ల మేర అడ్డంగా గుంత లోడేసి బాధ్యతారాహిత్యంగా పట్టణమంతా సరఫరా అవుతున్న మున్సిపల్ నీటి పైపులైన్ పగలగొట్టేశారు. అదేమని స్థానికులు కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా మున్సిపాలిటీ వారే గుంతలు లోడేందుకు అనుమతులు ఇచ్చారని చెప్పడం గమనార్హం.

మున్సిపల్ కమిషనర్ ఎస్‌కె ఫజిలుల్లాను ఫోన్‌లో 'ప్రజాశక్తి' వివరణ కోరగా 'ఆర్ అండ్ బి రోడ్డులో మాకేం సంబంధం లేదు' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం గమనార్హం. మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నా, ప్రజలకు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ పగలగొట్టేస్తున్నా మున్సిపల్ కమిషనర్ ఏమాత్రం పట్టనట్లు ఉండటాన్ని ప్రజలు మండిపడుతున్నారు.

కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేస్తాం : ఆర్ అండ్ బి జేఈ

ఆర్ అండ్ బి జేఈ చెంగల్‌రాయుడును వివరణ కోరగా 'ఇలా రోడ్డు తవ్వేసి పనులు చేసుకోడానికి మా అనుమతి లేదు.. మా సిబ్బంది తక్కువ ఉండటం వల్ల తాము ఇటువైపు రాలేకపోయాం.. మా దృష్టికి వచ్చాక వారిని పనులు ఆపాలని హెచ్చరించాం.. అయినా వారు వినకుండా పనులు కొనసాగిస్తున్నారు.. వారిపై కేసు నమోదు చేస్తాం' అని సమాధానం ఇచ్చారు.

తవ్వడానికి ఎవరు అనుమతి ఇచ్చారు : శివకవి ముకుంద, సిపిఎం

గ్యాస్‌పైప్‌లైన్ తవ్వడానికి కాంట్రాక్టర్‌కు ఎవరు అనుమతి ఇచ్చారో తెలపాలి. కనీసం తవ్విన గుంతలను పూడ్చే పరిస్థితి లేదు. గాంధీ పార్కు వద్ద మంగళవారం అర్ధరాత్రి గుంత లోడుతుంటే మున్సిపాలిటీ వాటర్‌పైప్‌లైన్ పగిలిపోయి తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడ్డారు. రోడ్డుపై నీళ్లు ప్రవహిస్తున్నా మున్సిపల్ కమిషనర్ పట్టించుకోలేదు. తాగునీటి పైప్‌లైన్ పగలగొట్టిన వారిపై కనీసం చర్యలు తీసుకోలేదు. కార్పొరేటర్లు పగలగొట్టిన తాగునీటి పైప్‌లైన్‌ను మున్సిపల్ వర్కర్ల చేత బాగు చేయించే ప్రయత్నం చేశారు.

15న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సూళ్లూరుపేట



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న రవాణా రంగం, వాటిలో ఆటోల ద్వారా ఉపాధి పొందుతున్న కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం కనికరం లేదని ఆటో కార్మికులు వాపోయారు. సిఐటియు ఆధ్వర్యంలో సూళ్లూరుపేట బస్టాండ్‌లో ఆటో కార్మికులు నిరసన తెలిపారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, జీవో నంబర్ 21ను రద్దు చేయాలని, సెప్టెంబర్ 15న తిరుపతి కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఎపి ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు పిలుపునిచ్చారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ ఉపాధి లేక నిరుద్యోగ యువకులు ఉన్నత చదువులు చదివి ఆటోడ్రైవర్లుగా మారుతున్నారన్నారు. అప్పుచేసి ఆటోలు కొనుగోలు చేసుకుని కుటుంబాలు పోషించుకుంటున్నారని, అలాంటి ఆటో కార్మికులకు సంబంధించి పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచి, ప్రైవేట్ ఫైనాన్సర్లు అధిక వడ్డీలు దోపిడీకి ఆటో కార్మికులు బలవుతున్నారని తెలిపారు. నాయకులు లక్ష్మయ్య, సి.చంద్రశేఖర్, సుంకర అల్లెయ్య, ఎ.కరీం, బి.వెంకటరమణ, మణి పాల్గొన్నారు.

గూడూరులో యువకుడు దారుణహత్య

వివాహేతర సంబంధమే కారణమా..?

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరులో యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.. వివాహేతర సంబంధమే హత్యకు కారణమై ఉంటుందని తెలుస్తోంది. గూడూరు రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గహాల్లో నివసిస్తున్న రహీద్ బాషా అలియాస్ మున్నా(35) కారు డ్రైవర్ గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం స్థానిక గాంధీనగర్ సమీపంలోని స్మశానం వద్ద రహీద్ భాషా రక్తపుమడుగులో పడి మృతిచెంది వుండటాన్ని స్థానికులు గుర్తించి రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందిం చారు. గుర్తుతెలియని వ్యక్తులు రహీద్ భాషా ను హత్యచేసివుంటారని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న డీఎస్పీ గీతాకుమారి, సీఐలు శ్రీనివాస్, శేఖరబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలపై విచారణ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసుల విచారణలో హత్యకు గల కారణాలు తెలియాల్సివుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక రెండోపట్టణ పోలీస్‌స్టేషన్ ముందు రహీద్ భాషా బంధువులు ఆందోళన చేశారు. హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీంతో మతుడి బంధువులకు, పోలీసులకు మధ్య స్వల్పవాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం పోలీసులు నచ్చచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

కట్ట పుట్టాలమ్మను దర్శించుకున్న తుడా చైర్మన్

ప్రజాశక్తి -రేణిగుంట



రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్ట గ్రామంలో వెలిసిన కట్టపుట్టాలమ్మ జాతర అత్యంత వైభవంగా జరుగుతోంది. బుధవారం తుడా చైర్మన్, టీటీడీ బోర్డు బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి జాతరలో పాల్గొని కట్టపుట్టాలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తుడా చైర్మన్ ని ఘనంగా ఆహ్వానించి అమ్మవారి దర్శన ఏర్పాట్లను చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కట్ట పుట్టలమ్మ ఆలయ చైర్మన్ రాజేంద్ర, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బుజ్జినాయుడు, వెంకటాచలం, సుధా, రామ్ నారాయణ, మోహన్, శీను పాల్గొన్నారు.

పుత్తూరులో లింగ సమానత్వంపై ర్యాలీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

మహిళల భద్రత, న్యాయ విజ్ఞానం, లింగ సమానత్వంపై అవగాహనా ర్యాలీ ఐసిడిఎస్ పుత్తూరు ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం జరిగింది. పుత్తూరు, వడమాలపేట మండలాల్లోని అంగన్‌వాడీ టీచర్లకు పదిరోజుల పాటు అవగాహన కల్పించనున్నారు. పనిచేసే ప్రదేశంలో మహిళలకు భద్రత ఉండాలని, రుతుక్రమ పరిశుభ్రత, పోక్సో చట్టంపైన అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. 'సఖి' గ్రూపుల్లో ఈ విషయాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సంధ్య, బి.గీతాంజలి, శ్రీదేవి, అనిత,వన్‌స్టాప్ సెంటర్ కోఆర్డినేటర్ అరుణ పాల్గొన్నారు.

డేటా సైన్స్ డిప్లొమా కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రొఫెసర్ సిఆర్ రావు 105వ జయంతి సందర్భంగా తిరుపతి నలందా నగర్‌లో ఐపిఎస్‌పి డేటా సైన్స్ సెంటర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. మొదటి అంతస్తులో స్టాటిస్టిక్స్ కన్సల్టెన్సీ సెల్‌ను ప్రొఫెసర్ పిసి మహలనోబిస్ కంప్యూటర్ ల్యాబొరేటరీని సందర్శించారు. మాజీ డైరెక్టర్, కోల్‌కత్తా ప్రొఫెసర్ బిఎల్ఎస్ ప్రకాశరావు, ఐఐటి తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణతో కలిసి సిఆర్ రావు సెమినార్ హాలును ప్రారంభించారు. ఐపిఎస్‌పి హానరరీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్‌రెడ్డి సెంటర్ భవనం, నిర్మాణ వ్యయం, వసతులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించిన మద్దతు గురించి వివరించారు. మహిళా విద్యార్థుల కోసం డేటా సైన్స్ డిప్లొమా కోర్సు ప్రారంభించడాన్ని కలెక్టర్ అభినందించారు. ఐపిఎస్పీ అధ్యక్షులు ప్రొఫెసర్ పి.జి. శంకరన్ పాల్గొన్నారు.


జాతీయ మహిళా సాధికారిత కాన్ఫరెన్స్ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ ఈ నెల 14, 15 తేదీలలో తిరుపతిలో జరగనున్న జాతీయ మహిళా సాధికారిత కాన్ఫరెన్స్ కు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం ఉదయం నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులతో కలసి పరిశీలించారు. సదస్సు జరగనున్న రాహుల్ కన్వెన్షన్ సెంటర్, అతిథులు బస చేయనున్న హెూటల్ గదులను పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చూడాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జి.ఎం. చంద్రమౌళి, తుడా ఈ.ఈ. రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్ లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతు మాధవ్, రవి ఉన్నారు.

సమిష్టి కృషితో...మెరుగైన సేవలు..!

- **బ్రహోత్సవాల ఏర్పాట్లు పూర్తవ్వాలి**
- **టిటిడి నూతన ఈవో సింఘాల్**

ప్రజాశక్తి - తిరుమల



శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు మరింత సేవా దక్పథంతో, మరింత బాధ్యతగా సేవలు అందించాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనిల్ కుమార్ సింఘాల్ ఉన్నతాధికారులకు దశ దిశ నిర్దేశించారు. తిరుమల అన్నమయ్య భవన్ లోని సమావేశ మందిరంలో బుధవారం ఉన్నతాధికారులతో పరిచయ కార్యక్రమం, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో అనిల్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు కేవలం రెండు వారాలు మాత్రమే ఉన్నాయని, గడువు లోపుగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు శ్రీవారి సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. శ్రీవారి ఆలయ పవిత్రతను కాపాడుకుంటూ, భక్తులకు ఇంకా ఎలాంటి మెరుగైన సేవలు అందించాలో ముఖ్యమంత్రిగారు సూచించారన్నారు. అదేవిధంగా, టిటిడి చైర్మెన్ ఇచ్చే ఫీడ్ బ్యాక్, బోర్డు మెంబర్స్, డయల్ యువర్ ఈవో, ఐవిఆర్ఎస్, వాట్సాప్ ద్వారా అభిప్రాయ సేకరణ, సర్వే తదితర మార్గాల ద్వారా ఎప్పటికప్పుడు భక్తులను అభిప్రాయ సేకరణ తీసుకుని ఇంకా మెరుగైన సేవలను అందించే అంశంపై దృష్టి పెట్టాలని కోరారు. అదేవిధంగా, వీలైనంత వరకు ఆధునిక టెక్నాలజీ సాయంతో మరింత మెరుగైన సేవలు అందించే అంశంపై దష్టి పెట్టాలన్నారు. టిటిడిలో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దన్నారు. ఉదయం కాలినడకన తిరుమలకు వస్తుంటే చాలా మంది భక్తులు టిటిడిలో అందుతున్న సేవలపై సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. అలాగే, భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలు చాలా రుచికరంగా, నాణ్యంగా ఉన్నట్లు భక్తులు చెప్పారన్నారు. తక్షణం చేపట్టే అభివద్ధి పనులు, దీర్ఘకాలికంగా చేపట్టనున్న పనులపై కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. భక్తులకు అందించే సేవలతోపాటు, విధానపరమైన నిర్ణయాలలో టిటిడి ఉన్నతాధికారులు, ఉద్యోగులు సమిష్టిగా నిర్ణయం తీసుకుని భక్తులకు వేగంగా, నాణ్యంగా సేవలు అందిద్దామన్నారు. ఈ సందర్భంగా అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ తిరుమలలో వసతి, అన్నప్రసాదాలు, డొనేషన్ తదితర శాఖలలో విధానపరమైన వ్యవస్థలను తీసుకువచ్చామని, దశల వారీగా టిటిడిలోని అన్ని శాఖలలో ఇదే విధానాన్ని తీసుకువచ్చి వ్యవస్థలను పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు టిటిడి ఈవోకు నివేదించారు. టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం, టిటిడి సివిఎస్వో మురళీకృష్ణ పాల్గొన్నారు.

రీ సర్వే పేరుతో అమ్మచెరువులో వేధింపులు : సిపిఎం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తి మండలం అమ్మ చెరువు గ్రామం రైతులను రీ సర్వే పేరుతో రెవెన్యూ యంత్రాంగం తీవ్రంగా వేధిస్తోందని గ్రామస్తులు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు దష్టికి తీసుకెళ్లారు. గతంలో జగన్మోహన్‌రెడ్డి నాటిని సర్వే రాళ్లపై ఉన్న ఆయన ఫోటోలు తొలగించడంపై ఉన్న శ్రద్ధ, రైతులకు రీ సర్వే జరిగిన వాటిని పట్టాదారు పాస్ పుస్తకాలు, 1బి ఇచ్చే పరిస్థితి లేకుండా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా పాసు పుస్తకాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. సర్వేయర్లు, విఆర్‌ఒలు గ్రామాన్ని సందర్శిస్తే రీ సర్వే జరిగిన వాటిని తాము మార్చలేమని, మళ్లీ ఆన్‌లైన్ సబ్ డివిజన్ ఏర్పాటు చేసుకోవాలని, ఆ ఎల్‌పి నెంబర్‌లో ఎంతమంది ఉంటే వారంతా అంగీకరిస్తే తప్ప సబ్ డివిజన్ చేసి పాస్ పుస్తకాల్లో మీ భూమి నమోదు చేయలేమని చెబుతున్నారని వాపోయారు. ఈ విషయమై శ్రీకాళహస్తి తహశీల్దార్‌ను కలిసి అడగ్గా 'మీ సర్వే నంబర్లకు ఆన్లైన్ సబ్ డివిజన్ రూ.50 చెల్లించి అప్లికేషన్ పెట్టాలి' అని చెబుతున్నారని, గతంలో తమ పాస్ పుస్తకాల్లో ఉన్న నంబర్లకు ఎందుకు డబ్బులు చెల్లించాలో రైతులకు దిక్కుతోచకుండా ఉందన్నారు. ఎక్కడెక్కడో ఉన్న అందరినీ అంగీకరింపజేసి తీసుకురావడం తలనొప్పిగా మారిందన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇచ్చినా ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదన్నారు. ఇకనైనా రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతుల సమస్యలు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

శాసనాల ద్వారా శ్రీవారి వైభవాన్ని చాటిన సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుమలలోని శాసనాలను, అన్నమయ్య సంకీర్తనలను అనువదించి వేంకటేశ్వరస్వామివారి వైభవం విశ్వవ్యాప్తం కావడానికి కషి చేసిన మహనీయుడు సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి అని తొండవాడకు చెందిన ప్రముఖ శాసన పరిశోధకులు సొరకాయల కష్ణారెడ్డి పేర్కొన్నారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి 44వ వర్ధంతి సభ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి పరిశోధనాదీక్ష " అనే అంశంపై ఉపన్యసిస్తూ, శ్రీవారి ఆలయ పేష్కారుగా ఉంటూ 1167 రాగిరేకుల శాసనాలను సేకరించి అనువదించినట్టు తెలిపారు. అన్నమయ్య కీర్తనల భాండాగారం నుంచి చాలా రాగి రేకులను వెలికితీసి కీర్తనలను వెలుగులోకి తెచ్చినట్టు వివరించారు. దేవస్థానం ఉద్యోగిగా మాత్రమే కాకుండా పురాతన వస్తు పరిశోధనా శాస్త్రవేత్తగా స్వామివారి వైభవాన్ని మొట్టమొదటిసారిగా ఎలుగెత్తి చాటిన ఘనత శాస్త్రికి దక్కిందన్నారు. ఎస్వీ విశ్వ విద్యాలయం సంస్కృత విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శిరీష, శాస్త్రి కూతురు గిరిజ, మనవడు, జడ్జి సివిఎన్ మూర్తి, డిపిపి ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, ప్రాజెక్టు సంచాలకులు లత, ప్రముఖ సాహితీవేత్త గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్ పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర దోబీఘాట్ కబ్జా పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

వేదాంతపురం గ్రామపంచాయతీ శ్రీ వెంకటేశ్వర ధోబిఘాట్ను కొంతమంది భూ కబ్జాదారులు రజకుల భూమిని కబ్జా చేసి రాత్రికి రాత్రి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని, అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని, రజకుల కే ఆ స్థలాన్ని కేటాయించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్ చేశారు. బుధవారం వేదాంత పురం గ్రామపంచాయతీలో ఉన్న దోబీ ఘాట్ స్థలాన్ని సిపిఐ బృందం పరిశీలించింది. మురళి మాట్లాడుతూ 2006లో ప్రభుత్వం శ్రీ వెంకటేశ్వర ధోబి ఘాట్ నిర్మాణానికి 55 సెంట్లు స్థలాన్ని కేటాయించారని, నేడు ఆ స్థలం అన్యాక్రాంత మవడం అప్రజా స్వామికమన్నారు. అక్రమ కట్టడాలను తొలగించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఎర్రజెండా నాయకత్వన అక్రమ కట్టడాలను తొలగించి రజకులకు అప్పగిస్తామన్నారుర. ఈ స్థలాన్ని పరిశీలించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య జల్లా విశ్వనాథ్, కె రాధాకృష్ణ ఉన్నారు

'స్థానిక' సమరంలో ఈవీఎంలు..?

ఎన్నికల కమిషన్ తర్జనభర్జన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

జనవరి నెలలో జరిగే స్థానిక ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సరికొత్త పోలింగ్ విధానాన్ని తీసుకురావాలని భావిస్తోంది. గతంలో స్థానిక ఎన్నికల్లో ఓటర్లు బ్యాలెట్ తోనే ఓటు వేసేవారు. దీనికి ఖర్చు ,సమయం ఎక్కువ అవుతుండడంతో ఈవీఎంలను ఆస్థానంలో ప్రవేశపెట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నీలం సాహి అభిప్రాయపడుతున్నారు.. మహారాష్ట్ర ,రాజస్థాన్, బీహార్ రాష్ట్రాల్లో స్థానిక ఎన్నికల సమయంలో ఈవీఎంలు వాడారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూడా స్థానిక ఎన్నికల్లో ఓటర్లు ఓటును ఈవీఎం బటన్ ద్వారా నొక్కేందుకు మార్గాన్ని అన్వేషిస్తున్నారు.. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయాన్నిఎన్నికల కమిషన్ తీసుకోనుంది.

తిరుపతి చిత్తూరు ఉమ్మడి జిల్లాలో గత ఐదేళ్ల క్రితం(2022) స్థానిక సమరానికి సంబంధించి బ్యాలెట్ పద్ధతిన ఓటింగ్ జరిగింది. 1079 పంచాయతీల్లో సర్పంచి, జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలు జరిగాయి.. రెండు విడతలుగా జరిగిన పోలింగ్ లో మొదటి దశ ఎన్నికల్లో 72.9%, రెండో దశ పోలింగ్ లో 79.1% పోలింగ్ నమోదయింది.. ఎక్కువ వార్డులు పంచాయతీలు, ఎంపీటీసీ, జడ్పిటిసి, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఏకగ్రీవాలు జరిగాయి.. పోటీ ఉన్నచోట ఎన్నిక తప్పలేదు. అప్పట్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో బూతులు ఏర్పాటు చేశారు..2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క తిరుపతి జిల్లాలోనే 3,800 పోలింగ్ స్టేషన్ లలో 9,120 ఈవీఎంలు,9120 వివి ప్యాడ్లు వాడారు.. అయితే జిల్లాల విభజన నేపథ్యంలో ఒక్క తిరుపతి జిల్లాలోనే 34 మండలాల్లో 822 పంచాయతీలు ఉన్నాయి. చిత్తూరు జిల్లాలో 31 మండలాల్లో 697 పంచాయతీలున్నాయి. ఇక తిరుపతి జిల్లాలో తిరుపతి కార్పొరేషన్, వెంకటగిరి, సూళ్లూరుపేట,గూడూరు నాయుడుపేట, శ్రీకాళహస్తి ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయి.

చిత్తూరు జిల్లాలో చిత్తూరు కార్పొరేషన్, నగిరి, పలమనేరు, కుప్పం, పుంగనూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా పెరిగిన ఓటర్ల లిస్టు, రిజర్వేషన్ ప్రక్రియ తదితర అంశాలు పరిశీలిస్తే జిల్లాలో గత ఎన్నికల కంటే పోలింగ్ స్టేషన్ లు పెరిగే అవకాశం ఉంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఆయా జిల్లా కలెక్టర్లతో ఎన్నికలకు సంబంధించి సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు. స్థానిక ఎన్నికల్లో ఈవీఎంల ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.. ఏదేమైనాప్పటికీ స్థానిక సమరం ఆసన్నమైంది.

సంగీత, సాహిత్య, నాట్యకళల మేళవింపే హరికథ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ సంగీతం, సాహిత్యం, నాట్యకళల మేళవింపే హరికథ కళారూపమని, కాబట్టే సామాన్య జనుల నుండి ఇప్పటికీ అమితమైన ఆదరణ లభిస్తోందని టీటీడీ హిందూ ధర్మ ప్రచారపరిషత్ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్ పేర్కొన్నారు. తిరుపతి శ్వేతా భవనంలో గత 10 రోజులుగా నిర్వహిస్తున్న " హరికథ వైభవం " శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా డిపిపి కార్యదర్శి మాట్లాడుతూ సనాతన హైందవ ధర్మాన్ని సామాన్య ప్రజలకు దగ్గర చేయడానికి, సామాజిక స్పృహ కలిగి సమాజాన్ని చ్కెతన్యవంతం చేయడానికి హరికథ ఒక ఆయుధమన్నారు. పురాతన కాలంలో కళాకారులను పోషించిన రాజులు చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. సైద్ధాంతిక వైభవం గల టీటీడీ ఇలాంటి కార్యక్రమాల నిర్వహణలో ఎప్పుడూ ముందుంటుందన్నారు. హరికథ శ్రీవారి వైభవంలో అతి ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. అదనపు కార్యదర్శి రామ్ గోపాల్ మాట్లాడుతూ ఎం. ఆదిభట్ల నారాయణదాస గొప్ప కళారూపమైన హరికథకు ఆద్యుడిగా నిలిచారని, హిందూ మతానికి ఎనలేని సేవలు అందించారని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి శిక్షణ తరగతులకు విచ్చేసిన 30 మంది మహిళా హరిదాసులకు హరికథ పత్రం అందించారు. ఎస్వీ సంగీత నత్య కళాశాల అధ్యాపకులు విజయలక్ష్మీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీసిటీ నర్సరీలో చిన్మయా విద్యార్థుల విజ్ఞాన యాత్ర

ప్రజాశక్తి - వరదయ్యపాలెం విజ్ఞాన యాత్రలో భాగంగా చిన్మయ విద్యాలయ విద్యార్థులు బుధవారం శ్రీసిటీ నర్సరీని సందర్శించారు. 2వ తరగతికి చెందిన 108 మంది విద్యార్థులు విచ్చేయగా, శ్రీసిటీ ఉద్యానవన అధికారి పవన్ కుమార్ వారికి నర్సరీలోని వివిధ మొక్కలు, వాటి విశిష్టత గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నర్సరీ ఆవరణలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి, స్వామిని దర్శించుకున్నారు. ఆలయం ముందు ఆశీనులై భక్తి శ్రద్ధలతో భగవద్గీతలోని 15వ అధ్యాయం 'పురుషోత్తమ ప్రాప్తియోగం' పారాయణం చేశారు. శ్రీసిటీ నిర్వాహకులు స్వామివారి తీర్థ, అన్న ప్రసాదాలు అందజేశారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బాల్య వివాహాలు కారణంగా పలు అనర్థాలు ఎదురవ్వు ప్రమాదం వుందని ఇన్‌ఛార్జ్ ఎంపిడివో మూర్తి పేర్కొన్నారు. మండలంలోని జెడిపి ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల వచ్చే అనర్థాల వివరించారు. వీటిని నివారి స్తే మాతా శిశు మరణాలను తగ్గించ వచ్చన్నారు. బాల్య వివాహాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించా రు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ దేవకుమారి, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు యమున, జ్యోతి విద్యార్థినులు పాల్గొన్నారు.

స్వమిత్వ యోజనపై సమీక్ష

ప్రజాశక్తి -కోట : స్వమిత్వ యోజన అమలు తీరుపై డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి వాణి ఆధ్వర్యంలో మండల పంచాయతీ కార్యదర్శులు , ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా తయారైన గ్రామంలో గ్రామ కంఠం, ఎక్కెండెడ్, గ్రామ కంఠాలలో తయారుచేసిన ప్రజలకు అవగాహన కల్పించి వారి ఇంటి నిర్మాణ కొలతలు తీసుకొని వారికి యాజమాన్య హక్కు పత్రం ఇచ్చే విధంగా ప్రజలందరికి తెలపాలన్నారు. ఈ కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దిలీప్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో వేణు, మండల సర్వేయర్ గోపి రెడ్డి పాల్గొన్నారు.

ఎరువులు వాడకంపై అవగాహన



చిన్నగొట్టిగల్లులో

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: నానో, జీవన ఎరువుల వాడకంపై మండల వ్యవసాయ అధికారిణి ధనలక్ష్మి రైతులకు బుధవా రం అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడు తూ నానో ఎరువులు జీవన ఎరువులు వాడి భూసారాన్ని కాపాడుకోవాలని, సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట పంటలు వేసుకోవాలని సూచించారు. పియంప్రనామ్(భూ సంరక్షణ పథకం) కింద పాటించాల్సిన పద్ధతులను వివరించారు. వివిధ మందులు ఏ మోతాదులో పిచికారీ చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: మండలంలోని చింతగుంట రైతు సేవ కేంద్రంలో రైతులకు పంటలపై, ఎరువులు వాడకంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులతో పాటు నానో యూరియా డీఏపీలను వాడటం వల్ల అధిక దిగుబడి పొందవచ్చుని తెలిపారు. సేంద్రియ ఎరువులతో పాటు నానో యూరియా ద్రావణం, డిఏపి ద్రావణం వాడటం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సీఏ కోర్సులతో ఉన్నత ఉద్యోగాలు



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు శ్రీనివాసరాజు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో చార్టెడ్ అకౌం టె న్సీ (సీఏ) చదివిన వారికి ఉద్యోగ రంగంలో ప్రాధాన్యత, మంచి ఉపాధి అవకాశాలు, భవిష్యత్తు ఉంటుం దని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ జి శ్రీనివాస రాజు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ జి శ్రీనివాసరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సీఏ కోర్సు చదివినవారికి ఆకర్షణీయమైన వేతనం, సమాజంలో గౌరవ ప్రతిష్ట లభిస్తుందన్నారు. చార్టెడ్ అకౌంటెన్సీ చదివినవారు జాతీయ అంతర్జాతీయ సంస్థలలో కామర్స్ వృత్తి నిపుణులుగా రాణిస్తారని, సీఏ కోర్స్ పూర్తి చేసిన వారు సొంతంగా ప్రాక్టీసు చేసుకోవచ్చన్నారు. కామర్స్‌తో డిగ్రీ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరం నుంచి సిఏ కోర్సుపై అవగాహన కలిగి ఉండాలని కామర్స్ శాఖాధిపతి డాక్టర్ ఏ దేవకి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి తిరుమలయ్య, లక్ష్మీబాయి, జ్యోతి, నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

భువనేశ్వరిదేవికి ఘన సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలోని బయోటెక్నాలజీ విభాగాధిపతి డా సి భువనేశ్వరిదేవి సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. తిరుమల నారాయణమ్మ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టరు సి భువనేశ్వరి దేవి కృషి, పట్టుదల, అంకితభావాన్ని కలిగి సేవలందిస్తు న్నారన్నారు. పరిశోధన, అకాడమిక్, కరికులర్ వంటి వాటిలోని ప్రతిభను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డు ఇచ్చారని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టరు ఉమారాణి, డాక్టరు విద్యుల్లత, డాక్టరు జయశ్రీ, దసాయికుమారి, డాక్టరు లక్ష్మి, హేమలత, కుసుమ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళా విశ్వవిద్యాలయంలో వర్క్‌షాప్



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, నలందా నగర్ కాలనీ, తుమ్మల గుంట జంక్షన్‌లో ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ తమ కొత్త డేటా సైన్స్ సెంటర్‌ను, శ్రీ వేంకటేశ్వర అభివృద్ధి నిలయాన్ని తిరుపతి కలెక్టర్, మేజిస్ట్రేట్ డాక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఉపకులపతి ప్రొఫెసర్ వి ఉమ, ఐఐటి డైరెక్టర్ ఆచార్య కెవెన్ సత్యనారాయణ, ఐఎస్ఐ మాజీ డైరెక్టర్ ఆచార్య బీఎల్ఎస్ ప్రకాశరావు హాజ రయ్యారు. ప్రొఫెసర్ సిఆర్‌రావు 105వ జన్మ దినోత్సవం సందర్భంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌పిఎస్ సంస్థ గౌరవాధ్యక్షులు ఆచార్య పుత్తా రాజశేఖర్ రెడ్డి , కొచ్చిన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మాజీ విసి, కొచ్చి ఐఎస్పిఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ పిజి శంకరన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఘనంగా గంగ జాతర

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని మున్సిపాల్టీ గేట్ పుత్తూరులో గంగమ్మ జాతర వేడుకగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గంగమ్మను దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పుత్తూరు పట్టణ జనరల్ సెక్రటరీ ఎన్ ఎన్ ధనపాల్ ఆయనను దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చిన్నబాబు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, బాబు నాయుడు, వై ప్రసాద్ నాయుడు, ఏ ఆనంద్, మురళి పాల్గొన్నారు.

విష జ్వరాల నివారణకు వైద్యశిబిరం



ప్రజాశక్తి-నాయుడుపేట: విష జ్వరాల నివారణకు ప్రభుత్వ వైద్యులు బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. నాయుడుపేట మున్సిపాల్టీ పరిధిలోని శ్రీనివాసపురంలో గత కొద్దిరోజులుగా విష జ్వరాలు విజృంభిస్తుండడంతో గొట్టిప్రోలు పిహెచ్ సి కి చెందిన డాక్టర్ శంకరయ్య 20 మంది వైద్య సిబ్బందితో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది శ్రీనివాసపురం గిరిజన కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి జ్వర పీడితులకు, వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకరయ్య వైద్య బృందం కాలనీలో పర్యటించి అస్తవ్యస్తంగా ఉన్న పరిసరాలను గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీవాసులు పరిస రాలను తమ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచు కోవాలని, మురికి నీటి గుంటలను పూడ్చి వేయడంతో పాటు చెత్త నిల్వలను తొలగించాలని సూచించారు. వైద్యులు కాలనీవాసుల అనారోగ్యాలకు కారణాలు తెలుపుతూ శ్రీనివాసపురం గిరిజన కాలనీలో శుద్ధ నీరు సరఫరా అవుతుండడం వల్ల కిడ్నీ, లివర్ వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. వైరల్ ఫీవర్ వ్యాప్తిచెందుతున్నా. గతంలో బిరదవాడ నుండి స్వర్ణముఖి నుండి వచ్చే తాగునీరు సరఫరా అవుతుండే దని తెలిపారు. కాలనీలో ఏర్పాటు చేసిన బోర్ పాయింట్ నుండి శుద్ధ నీరు వస్తుండడంతో కిడ్నీ, లివర్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని తెలిపారు. మున్సిపాలిటీ అధికారులు చొరవ చూపి శ్రీనివాసపురం గిరిజన కాలనీకి స్వర్ణముఖి నీటిని సరఫరా చేయాలని కోరారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని అన్నారు. శ్రీనివాసపురం గిరిజన కాలనీ వాసులకు వనపాక భూలక్ష్మి సేవా సమితి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకరయ్య హెడ్మాస్టర్ చంద్రయ్య, వైద్య సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల డాక్టర్‌తో మరమ్మతులు: కమిషనర్



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లపై ఏర్పడిన గుంతలను ‘రోడ్ డాక్టర్’ యంత్రం ద్వారా పూడ్చి వచ్చునని కమిషనర్ ఎన్ మౌర్య తెలిపారు. నగరంలో ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు ప్రత్యేకంగా తెప్పిన రోడ్డుడాక్టర్ పని తీరును బుధవారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఏర్పడిన గుంతలను మనుషులతో పూడ్చేవారమని అన్నారు. అయితే నూతన టెక్నాలజీ తో సిద్ధం చేసిన రోడ్ల డాక్టర్ యంత్రం ద్వారా ఎప్పటికప్పుడు పూడ్చేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ యంత్రాన్ని సుమారు 1.50 కోట్లతో కొనుగోలు చేశామని తెలిపారు. తిరుపతి లో ఏర్పడే గుంతల్ని పూడ్చేందుకు నెలల తరబడి ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా ఈ యంత్రం ద్వారా ఎప్పటికప్పుడు పూడ్చి వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిలేకుండా చేయవచ్చని తెలిపారు. సీసీ రోడ్లు, తారు రోడ్లు పూడ్చేందుకు వినియోగిస్తారని తెలిపారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్‌లు తులసి కుమార్, గోమతి, డిఈలు లలిత, మహేష్, వెంకట్ ప్రసాద్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

విద్యుత్ అదాలత్‌లో సిపిఎం వినతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని చైర్‌పర్సన్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రం అందించారు. పట్టణంలోని విద్యుత్ డిఈ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక, ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చైర్ పర్సన్, రిటైర్డు జడ్జి శ్రీనివాస ఆంజనేయ మూర్తికి సిపిఎం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పుత్తూరు పట్టణ సిపిఎం కార్యదర్శి ఆర్ వెంకటేష్, దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై నందయ్య మాట్లాడుతూ పుత్తూరు మండలంలోని ఎగువగులూరు చెరువు లో విద్యుత్ స్తంభాలు నీట మునిగాయని, వాటికి మరమ్మతులు చేసి పోల్ లైన్ మార్చి అక్కడి రైతులకు విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఇంటి విద్యుత్ లైన్లు కూడా మార్చాలని, వీధుల్లో విద్యుత్ తీగలు ఇళ్లపై వున్న వాటిని మార్చి, కొన్నిచోట్ల స్తంభాలు మార్చి కొత్త లైను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని, పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని జీవో ఇచ్చారని, ఆ జీవోను వెంటనే అమలు చేయాలని సూచించారు. అదాని స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ట్రూ అప్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ జడ్జి , విద్యుత్ డి ఈ స్పందించి మీ న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



విద్యుత్ లోక్ అదాలత్‌లో వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

గ్రామసభకు స్పందన కరువు

వెనుతిరిగిన తహశీల్దారు



జనం లేక స్పందన కరువైన గ్రామ సభ

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం ఎ రంగంపేట పంచాయతీలో ఆరేపల్లి, నాగపట్ల, రెవెన్యూ పరిధిలో అధికారులు, సచివాలయ సిబ్బంది బుధవారం నిర్వహించిన రీ సర్వే గ్రామసభకు స్పందన లేకపోవడంతో తహశీల్దారు వెనుతిరిగారు. ఎ రంగంపేట పంచాయతీలో ఆరేపల్లి, నాగపట్ల, రెవెన్యూ పరిధిలో అధికారులు, సచివాలయ సిబ్బంది బుధవారం రీసర్వే నిర్వహించారు. డియల్‌ఆర్‌ను గ్రామసభలో చదివి వినిపించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. అయితే అనుకున్నట్లు తహశీల్దారు శివరామసుబ్బయ్య, మండల సర్వేయర్ సురేష్‌లు హాజరయ్యారు. కానీ ఈ గ్రామ సభకు జనాలు రాకపోవడంతో తహశీల్దారు గ్రామ సభను గురువారానికి వాయిదా వేసి వెనుదిరిగారు. విఆర్‌వో భాస్కర్‌ని పిలిచి ఎరంగంపేటలో దండోరా వేయించి జనాన్ని రప్పించాలని ఆదేశించినా ఎందుకు చేయలేదని మందలించారు. ఇక్కడకు వచ్చిన కొంత మంది నాయకులు విఆర్‌వో భాస్కర్ పంచాయతీ ప్రజలు సక్రమంగా సమాచారం తెలపడం లేదని, రైతులు, గ్రామస్తులు తహశీల్దారుకి ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం మధ్యాహ్నం గ్రామ సభకు పంచాయతీ ప్రజలు హాజరయ్యేలా చూడాలని విఆర్‌వోకు సూచించారు.

బదిలీ వీఆర్‌వోలకు రిలీవ్ ఇవ్వాలి



మీడియాతో మాట్లాడుతున్న విఆర్‌వోలు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని కోటకాడపల్లి, చింతగుంట పంచాయతీలలో విఆర్‌వోలుగా విధులు నిర్వహిస్తున్న రమణయ్య, శివనారాయణలకు కలెక్టర్ ద్వారా బదిలీ ఉత్తర్వులు వచ్చినా మండలం నుండి రిలీవ్ ఆర్డర్ ఇవ్వకుండా ఆవేదనకు గురి చేస్తున్నారని విఆర్‌వోలు రమణయ్య, శివనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల క్రితం శివనారాయణకు రేణిగుంట, రమణయ్యకు శ్రీ కాళహస్తికి కలెక్టర్ కార్యాలయం నుండి బదిలీ ఉత్తర్వులు వచ్చినా వెళ్లడానికి వీలు లేదని ఇక్కడే పనిచేయాలని తహశీల్దారు వింత వైఖరి అవలంబిస్తున్నారని విఆర్‌వోలు మీడియాకు తెలిపారు. అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అదనపు ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చి తీవ్ర పని ఒత్తిడికి గురి చేస్తున్నారని ఇది మంచిది కాదని తహశీల్దారుపై దళిత డప్పు కళాకారుల సంఘం నాయకులు పాటూరి రెడ్డప్ప హెచ్చరించారు. వెంటనే రిలీవ్ చేయకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు నిరసన వ్యక్తం చేశారు.

విద్యార్థుల్లో నైపుణ్యత పెంపొందించాలి

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలను పెంపొందించేలా బోధించాలని మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాధ్, ముని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని కల్లెవెట్టు బుచ్చినాయుడు కండ్రిగ, పల్లమాల జెడ్పీ ఉన్నత పాఠశాలల క్లస్టర్ పరిధిలోని ఉపాధ్యాయులకు బుధవారం మధ్యాహ్నం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎఫ్ఏ పరీక్షలు పూర్తి అయ్యాయని, విద్యా సంవత్సరం నుండి సరికొత్తగా విద్యార్థులందరికీ అసెస్‌మెంట్ బుక్స్ ఇచ్చి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఫౌండేషన్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. బడికిరాని పిల్లలను గురించి, బడికి వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: విద్యార్థులలో తరగతికి కావలసిన నిర్దిష్టమైన విద్యా ప్రమాణాలు పెంచాలని ఎంఈవో మార్కండేయ నాయుడు అన్నారు. రామచంద్రపురం మండలంలోని అనుపల్లి మోడల్ స్కూల్ ను బుధవారం మండల విద్యాశాఖ అధికారి తో పాటు ఉపాధ్యాయుల బృందం తనిఖీ చేసింది. విద్యార్థుల ప్రమాణాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం వివిధ విషయాలపై పరీక్షలు నిర్వహించారు. అనుపల్లి ప్రాథమిక పాఠశాలను మోడల్ పాఠశాలగా ఏర్పాటు చేశామని మౌలిక సదుపాయాలు, విద్యాబోధనలో మార్పులు తెచ్చినట్లు తెలిపారు. ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకొని విద్యార్థులకు ఉత్తమ ప్రమాణాలు అందించి ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ పాఠశాలను అన్ని విధాల ముందుకు తీసుకొని పోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో మోడల్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, లీలావతి, కళ్యాణి, టీవీఎస్ ఎన్ రాజు,, వాసుదేవయ్య, మేరీ హేమలత, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వర్సిటీ ‘విస్తరణ కేంద్రం’ ఆధ్వర్యంలో శ్రీపద్మావతి మహిళా అభ్యుదయ సంఘం ఆకారంపల్లి వారికి వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు వారం రోజులపాటు నిర్వహించారు. వారికి ఉన్నితో వస్త్రాలు, బొమ్మలు, పెన్సిల్ఫ్ ఫ్లవర్స్ మొదలైన వాటిని తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డి సాయిసుజాత, రిసోర్స్ పర్సన్ కె సుభాషిణి, మహిళా అభ్యుదయ సంఘం సభ్యులు, అధ్యయన కేంద్రం అకడమిక్ కన్సల్టెంట్ లు పాల్గొన్నారు.

‘ఉమెన్ శక్తి’ స్పెషల్‌పై అవగాహన

ప్రజాశక్తి - చంద్రగిరి : చంద్రగిరి మండలం, ఐతేపల్లిలోని జెడ్పి హై స్కూల్‌లో ఉమెన్ శక్తి స్పెషల్ అవగాహన సర్పంచ్ ఫజిల్లా, ఎంపిటిసి శేఖర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కౌమార దశలో ఉన్న 6 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న బాల బాలికలకు బాలల హక్కులు, పోక్సో చట్టం, లీగల్ అవేర్‌నెస్, బాల్య వివాహాల నిరోధం, ఆరోగ్యం, పోషణ, గుడ్ టచ్, బాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమానికి ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్ బాబు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. హక్కులు, చట్టాలపై అవగాన పెంచుకోవాలని తెలిపారు.

రేణిగుంట : రేణిగుంట మండలం ఆర్ మల్లవరం పాఠశాలలో ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ కృష్ణవేణి ఆదేశాల మేరకు మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ పిల్లలకు బాలల హక్కులు, మంచి స్పర్శ ,చెడు స్పర్శ ,స్వీయ సంరక్షణ మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ఐసిడిఎస్ సూపర్వైజర్ ,రాస్ కోఆర్డినేటర్ భారతి ,అంగన్వాడీ కార్యకర్తలు రేఖ, మునీశ్వరి, విమల, నాగరత్నమ్మ , ప్రధాన ఉపాధ్యాయుడు రమణ పాల్గొన్నారు

విద్యార్థులకు అవగాహన

క్యాంపస్ : ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం క్లినికల్ సైకాలజీ విభాగం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ, డాక్టర్ మాదవి, సైక్రియాటిస్ట్ విభాగం, శ్రీ బాలాజీ మెడికల్ కాలేజీ, హాస్పిటల్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, రేణిగుంట హాజరై, ఆత్మహత్య నివారణపై విలువైన సూచనలు అందించారు. విద్యార్థులకు అధ్యాపకులు అవగాహన పెంపొందించారు. క్లినికల్ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ప్రొఫెసర్. రజని, అధ్యాపకులు డాక్టర్ గాయత్రి, డాక్టర్ లత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నియోజక వర్గ పరిధిలోని, గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పరిధిలోని దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా స్థానిక జడ్‌పి బాయ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యయులు భారతి హాజరయ్యారు. ఈ శిబిరం ముఖ్య ఉద్దేశం ప్రత్యేక అవసరాలు గల పిల్లల సమస్యలను గుర్తించి, వారికి ఉపయోగ పడే ఉపకరణాలు నిర్ధారణ చేయడం. ఈ కార్య క్రమానికి జిల్లా సహిత విద్య సమన్వయ కర్త చంద్రశేఖర్ రెడ్డి బాధ్యత వహించారు. డిప్యూటీ డిఈవో సనత్ కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎంఈఓ1, రవీంద్రబాబు, ఎంఈవో-2 కాంచన, చిల్లకూరు ఎంఈఓ 2 రవూఫ్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ఏఎల్‌ఐఎం సిఓ వైద్య నిపుణులు ప్రియ, ఫిజియోథెరపి డాక్టరు శివకుమార్, స్పెషల్ ఎడుకేడర్ జ్యోతిర్మయి చిల్లకూరు, గుడూరు, కోట, వాకాడు చిట్టమూరు మండలాల ఐఈఆర్‌పిలు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన నేదురుమల్లి



ప్రజాశక్తి- వెంకటగిరి: మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డిని బుధవారం తాడేపల్లిలో వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులు, మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు తీరు, అధికారులు వ్యవహరించిన విధానాలు వంటి అంశాలను నేదురుమల్లి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇక నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు చేపడుతున్న చర్యలను వివరించారు.

15న సదస్సును జయప్రదం చేయండి

ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈ నెల 15వ తేదీ తిరుపతి జిల్లా ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సదస్సును నిర్వహిస్తారని దీన్ని జయప్రదం చేయాలని గూడూరు డివిజన్ అధ్యక్షులు పారిచర్ల శ్రీనివాసులు గ్రామ ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఈ విషయం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులకు పే స్కేలు, అమలు చేయాలని వీఆర్వో , అటెండర్లు కు ప్రమోషన్లు కల్పించాలని, గ్రామ రెవెన్యూ సహాయకులు విఆర్‌ఏలు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విఆర్‌ఏల సమస్యలు పరిష్కారానికి అనేక దపాలుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఇప్పటివరకు పరిష్కారానికి నోచుకోలేదని తెలిపారు. దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి ఈనెల 15వ తేదీ సోమవారం మాయాబజార్ లోని వాటర్ ట్యాంక్ వద్ద నున్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి ప్రదర్శనగా బయలుదేరి వివేకానంద రోడ్డు మీదగా గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం చేరుకొని తమ సమస్యలపై వినతి పత్రం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఏ నాయకుల సంఘం జిల్లా కార్యదర్శి కొల్లపూడి సుబ్బయ్య, గూడూరు వీఆర్‌ఏల సంఘం అధ్యక్షులు సమయాల రామయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

ప్రజాశక్తి-రామచంద్రపురం: మహిళలు, కిశోర బాలికలు పౌష్టికాహారంతో రక్తహీనతను అధిగమించ వచ్చునని అంగన్‌వాడీ కేంద్రం పర్యవేక్షకులు, అడిషనల్ సిడిపిఓ జ్యోతి, కె మనీలా, రేవతి అన్నారు. రామచంద్రాపురం మండలంలోని కే కే వి పురం, కుప్పం బాదురు ఉన్నత పాఠశాలలలో బుధవారం వారి ఆధ్వర్యంలో “మిషన్ శక్తి సంకల్ప’ కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలలో పోషకాహార లోపం, కేన్సర్ నివారణ, బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థం వంటి విషయాల పైన అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడిలు,చర్మ సమస్యలు మానసిక సమస్యలు వంటి సాధారణ ఆరోగ్య సమస్యలను అధిగమించేందుకు చేపట్టవలసిన పరిస్థితులను వివరించారు. కుప్పం బాదూరు వైద్యాధికారి డాక్టర్ పూర్ణిమ మహిళల్లో వచ్చే గర్భాశయం, బ్రెస్ట్ కేన్సర్లు, బాలికలలో అరుదుగా వచ్చే లుకేమియా కేన్సర్లు నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. పిల్లలచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కే కే వి పురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం వెంకటేశులు, నీరజ, కోమల, గోవింద రాజన్, అంగనవాడీ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారిణి

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ వేణుగోపాలపురం పంచాయతీలో ఎం మోహన్ పొలంలో ఉపాధిలో భాగంగా చేపట్టిన ఫారం పాండ్ పనులను డ్వామా పథక సంచాలకులు సివి శ్రీనివాసప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతు తమ పొలాల్లో ఫారం పాండ్‌లు తవ్వు కొనడం వల్ల భూగర్భ జల్లాలు వృద్ధి చెందడమే కాకుండా, భూమి పొరల్లో తేమ వల్ల పంటకు మేలు చేసే మిత్ర పురుగులు వృద్ధి చెందుతాయన్నారు. అనంతరం ఉపాధి హామీ శ్రామికులతో మాట్లాడుతూ నిర్ణయించిన ప్రకారం కొలతలతో పనిచే ఉపాధి పొందా లన్నారు. ఎన్‌యంయంఎస్ హాజరులో వంద శాతం పారదర్శకత పాటించాలని సూచించారు. ప్రతీ రోజూ గ్రామ స్థాయి శ్రామికుల ఫొటోలను మండల స్థాయి అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, రాష్ట్ర స్థాయి అధికారులు పరిశీలించి తప్పులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఉపాధి ద్వారా మంజూరు చేస్తున్న మినీ గోకులా లను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ పథక సంచాలకులు డి సరితా, అదనపు కార్యక్రమాధికారులు డి చంద్రశేఖర్ రాజు, అవిలాల దేవరి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ భాను శేఖర్, టెక్నికల్ అసిస్టెంట్‌లు రవీంద్రుడు, మధుసూదన్ , వెంకటయ్య, మాధవి, ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.



ఉపాధి పనులు పరిశీలిస్తున్న శ్రీనివాస ప్రసాద్

క్రైం న్యూస్

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: నడిరోడ్డు పై నడిచి వెళుతున్న వ్యక్తి హఠాత్తుగా మార్గంలో కిందపడి మృతి చెందిన ఘటన బుధవారం తిరుపతిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తిరుపతి గ్రూప్ థియేటర్స్ ఎదురుగా రోడ్డుపై నడిచి వెళ్తున్న 35-40 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వ్యక్తి మూర్ఛ వ్యాధితో కింద పడ్డారు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తిని పరిశీలించిన వైద్యులు, అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే తిరుపతి ఈస్ట్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

యాచకురాలు మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దప్పిక తీరక ఓ యాచకురాలు మృతి చెందిన సంఘటన శ్రీకాళహస్తీశ్వరాలయ నాలుగో గేటు వద్ద బుధవారం చోటు చేసుకుంది. భక్తులు ఇచ్చిన సమాచారంతో ఆలయ సిబ్బంది ఆమె మృతదేహాన్ని వన్ టౌన్ పోలీసులకు అప్పగించగా, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. యాచకురాలి చీర కొంగులో లభించిన నగల కుదువ చీటీ ఆధారంగా మృతురాలు వరదయ్యపాలెం మండలం పద్మావతి పురం గ్రామానికి చెందిన మీనాక్షమ్మ(55)గా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు బంధువులకు సమాచారం అందించగా మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని శ్రీకాళహస్తిలోనే అంత్యక్రియలు పూర్తి చేసినట్లు వన్ టౌన్ సీఐ గోపి తెలిపారు.

కూలీల నగదు స్వాహాపై ఫిర్యాదు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం మండల పరిధిలోని ఏకొల్లు గ్రామానికి చెందిన వనసంరక్షణ సమితి కూలీలకు రావలిసిన నగదు స్వాహా చేశారని స్థానిక పోలీస్ స్టేషన్ లో బుధవారం ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు.. ఏకొల్లు గ్రామానికి చెందిన 187మంది కూలీలు గతంలో, అటవీ భూములో కూలీ పనులు చేశారు. వీరికి 2లక్షలా9వేల రూపాయలు అటవీ శాఖ నుండి మంజూరు చేశారు. ఈ నగదును అందరూ కూలీలు సమానంగా పంచుకొనేదుకు, అటవీ సిబ్బంది, కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. అయితే కమిటీలోని అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఇద్దరు నగదు డ్రా చేసుకొని ఒక్కొక్క కూలికి 1,117రూపాయలు రావాలి, అయితే వీరు తమకు 500 రూపాయలు మాత్రమే పంచారని తెలిపారు. మిగిలిన నగదును స్వాహా చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్‌లు విచారించి న్యాయం చేస్తామని కూలీలకు తెలిపారు.

దర్శనానికొచ్చి.. చిన్నారి మృతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: పసిబిడ్డకు తీవ్ర అనారోగ్యం ఉన్నా లెక్కచేయకుండా, వైద్యులు వారించినా పట్టించుకోక శ్రీవారిపై ఉన్న భక్తిని చాటుకునేందుకు దర్శనానికి వెళ్లి, ఏడాది పసిబిడ్డను కోల్పోవ డంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నెల్లూరు జిల్లా కనిగిరికి చెందిన సురేష్ అంజలి దంపతులకు చిన్న కుమార్తె మైతిల్ (1)తో కలిసి కుటుంబ సభ్యులు తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనార్థం సోమవారం తిరుపతికి చేరుకున్నారు. పాపకు తీవ్ర జ్వరం రావడంతో తిరుపతిలోని వైష్ణవి హాస్పిటల్లో వైద్యులను సంప్రదించారు. 104 సెంటిగ్రేడ్ల తీవ్ర జ్వరంతో ఉన్న పాపను పరిశీలించిన వైద్యులు, తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఏడాది వయసున్న పాపను తిరుమలకు తీసుకెళితే ప్రమాదమని, దర్శనాన్ని రద్దు చేసుకుని, తిరిగి ఊరికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని అక్కడ వైద్యులు సూచించారు. వైద్యులు వారించినా తల్లిదండ్రులు వినకుండా చికిత్స అనంతరం అదేరోజు రాత్రి తిరుమలకు చేరుకున్నారు. తిరుమల అఖిలాండం వద్ద ఆరుబయటే పాపతో పాటు నిద్రించి, ఉదయం స్వామికి పాప తలనీలాలు సమర్పించి, చల్లనీటి స్నానం చేయించారు. పాపకు జ్వరం ఎక్కువ కావడంతో తిరుగు ప్రయాణంలో తిరుపతికి చేరుకున్న కుటుంబ సభ్యులు మంగళవారం మధ్యాహ్నం మరోసారి వైష్ణవి హాస్పిటల్ వైద్యులను సంప్రదించారు. అప్పటికే నిరంతర జ్వరంతో బాధపడుతున్న చిన్నారి పరిస్థితి మరి విషమం కావడంతో, అక్కడ వైద్యులు ఆస్పత్రిలో చేర్పించుకునేందుకు అంగీకరించలేదు. తల్లిదండ్రులు గట్టిగా ప్రాధేయపడటంతో వెంటనే ఉంచి చికిత్సను ప్రారంభించారు. ఐదు గంటల వ్యవధిలోనే చిన్నారి ఆరోగ్యం క్షీణించడంతో రాత్రి 8 గంటలకు మృతి చెందింది. విషయం తెలుసుకున్న చిన్నారి బంధువులు ఆసుపత్రి వద్దకు చేరుకుని, ఆసుపత్రి నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే పాప చనిపోయిందని ఆరోపిస్తూ వారిపై దూషణకు దిగి నిరసన వ్యక్తం చేశారు. వైద్యులు జరిగిన పరిణామాలు మొత్తాన్ని పూసగుచ్చినట్లు వివరించి సీసీ కెమెరాలు ఫుటేజ్‌ను చూపించి వివరించడంతో కుటుంబ సభ్యులు తప్పు తమదే అని గ్రహించి వేకువజామున చిన్నారి మృతదేహాన్ని తీసుకొని సొంత ఊరికి వెళ్లిపోయారు.

తల్లిదండ్రులు వినిపించుకోలేదు

చిన్నారి మైధిల్‌కు 104 జ్వరంతో ఆసుపత్రికి రావడంతో చికిత్స అందించామని, ఆ పరిస్థితుల్లో ఇంటికి తీసుకెళ్లాలని చెప్పినా వారి తల్లిదండ్రులు వినలేదని వైష్ణవి ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. వైరస్ కారణంగా చిన్నారి లంగ్స్ మొత్తం పాడైపోయి మృతి చెందిందని తెలిపారు. ఇందులో తమ తప్పిదం ఏమీ లేదని పేర్కొన్నారు.

రికార్డు అసిస్టెంట్‌కు పాముకాటు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ గా పనిచేస్తున్న రామయ్య బుధవారం పాము కాటుకు గురయ్యాడు. రోజువారి విధుల్లో భాగంగా రామయ్య గ్రంథాలయం తలుపులు తెరిచి పుస్తకాలపై దుమ్మును శుభ్రపరుస్తుండగా కాలుపై పాము కాటు వేసింది. దీంతో ఆయనను హుటాహుటిన స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి మెరుగ్గా ఉందని ప్రిన్సిపాల్ నాగరాజు నాయుడు తెలిపారు. గ్రంథాలయం సమీపంలో ఉన్న మంచినీళ్లగుంట ప్రాంతం నుంచి పాములు, విషపురుగులులోనికి ప్రవేశిస్తున్నాయని అధ్యాపకులు తెలిపారు.

క్రీడల్లో జిల్లా ఖ్యాతిని పెంచాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: క్రీడల్లో సత్తా చాటి జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయకుమార్ నాయుడు అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం అండర్ -14, అండర్ -17, అండర్-19 విభాగాల్లో సాఫ్ట్ టెన్నిస్ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయ్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు శారీరక ఉత్తేజంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయన్నారు. క్రీడాభివృద్ధికి ఎమ్మెల్యే బొజ్జల ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 450 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు భార్గవి, కిశోర్, ఫిజికల్ డైరెక్టర్లు వెంకటముని, ఇందిర పాల్గొన్నారు.

టిటిడి ఎస్‌వి ప్రాణదాన ట్రస్టుకు విరాళం

ప్రజాశక్తి- తిరుమల: బెంగళూరుకు చెందిన లాక్విన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి జె.దేవరాజులు టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు బుధవారం రూ.10 లక్షల విరాళాన్ని అందించారు. ఈ మేరకు దాత విరాళం డిడిని తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు అందించారు.

పండ్లు పంపిణీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరిల వివాహ వార్షికోత్సవ సందర్భంగా టిడిపి నాయకులు పాతకం వెంకటేష్ ఆధ్వర్యంలో తిరుపతిలోని పాస్ మనోవికాస్ మానసిక దివ్యాంగుల క్షేత్రంలో బుధవారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మన రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న దూరదృష్టిగల నాయకుడని, భువనేశ్వరి తన సామాజిక కార్యక్రమాలు ద్వారా చేసిన కృషి అమోఘం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు క్లస్టర్ ఇన్‌ఛార్జి మునిశేఖర్ రాయల్ పాల్గొన్నారు.

ట్యాంకులకు మరమ్మతులు..పునర్నిర్మాణం, పునరుద్ధరణ

- 33 కరువు ప్రభావిత మండలాలకు లబ్ధి - కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: జిల్లాలో 181 నీటి పారుదల ట్యాంకుల పునరుద్ధరణకు సుమారు -రూ.515.18 కోట్లతో ప్రాజెక్టుకు అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపేందుకు కలెక్టర్ వెంకటేశ్వర్, ఇరిగేషన్, కేంద్ర భూగర్భ జల, జిల్లా భూ గర్భ జల శాఖ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. స్థానిక కల్లెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని ˜లెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ ఆర్ ఆర్ మరమ్మతులు, పునరుద్ధరణ పునర్నిర్మాణం కార్యక్రమంపై సంబంధిత అధికారులతో చర్చించారు. జిల్లాలో 181 నీటిపారుదల ట్యాంకులను ప్రతిపాదనల నివేదికలు పంపేందుకు సిద్ధం చేయాలన్నారు. ఈ 181 ట్యాంకుల ద్వారా మొత్తం 30,081.85 హెక్టార్ల ఆయకట్టు ప్రయోజనం లభించనుందని, ప్రతిపాదిత పనులకు అంచనా వ్యయం సుమారు రూ. 515.18 కోట్లు అని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 33 కరువు ప్రభావిత మండలాలు లబ్ధి పొందనున్నాయని, ఆర్‌ఐ ఏడీ పరిధిలోని 34 మండలాలు కూడా ఈ ప్రాజెక్టు ద్వారా ప్రయోజనం పొందనున్నాయని తెలిపారు. బండ్లు, ఇన్నర్లు, స్లూయిస్‌లు, సరఫరా ఛానెళ్లు, నీటిపారుదల ఛానెళ్ల మరమ్మతులు చేపట్టనున్నామని తెలిపారు. ప్రాజెక్టు కార్యచరణపై సమగ్రంగా చర్చించి తదుపరి రాష్ట్ర సాంకేతిక కమిటీ ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా నీటి పారుదల శాఖ ఎస్‌ఈ రాధాకృష్ణ, ఎస్‌ఈ చిత్తూరు వెంకటేశ్వర రాజు, ఎస్‌ఈ నెల్లూరు దేశీ నాయక్, తిరుపతి ఈ ఈ వెంకటేశ్వర ప్రసాద్, డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్, భూగర్భ జల శాఖ డిడి శోభన్ బాబు, కేంద్ర భూ గర్భజల శాఖ అధికారులు, శ్రీ కాళ హస్తి, వెంకటగిరి, గూడూరు ఈఈలు వెంకటశివారెడ్డి, బాబు, బాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శివాలయం హుండీ లెక్కింపు


పారదర్శకతపై ప్రజల్లో అనుమానాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణంలోని ప్రముఖ ఆలయాలు శ్రీ కామాక్షి సమేత సదాశివేశ్వర ఆలయం, ఆరేటమ్మ దేవాలయం హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆలయ ఈవో జై కృష్ణ కథనం మేరకు.. సదాశివేశ్వర శివాలయం హుండీ ద్వారా రూ.3,59,599 ఆదాయం వచ్చినట్లు, ఆరేటమ్మ దేవాలయం హుండీలో రూ1,07,769 వచ్చినట్లు వెల్లడించారు. మార్చి నుండి సెప్టెంబర్ వరకు వచ్చిన ఆదాయం వెల్లడించారు. అయితే, జరిగిన లెక్కింపునకు సంబంధించిన పూర్తి సమాచారం ప్రజలకు అందించకపోవడం, పత్రికలకు సరైన వివరాలు తెలియకపోవడం వల్ల కొత్తగా ఏర్పడిన పాలక మండలిపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి. పారదర్శకంగా ఉండాల్సిన హుండీ లెక్కింపులో ఇలా సమాచారం దాచిపెట్టడంపై విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

15న కలెక్టరేట్ ముట్టడి..

ఏపీ ఆటో రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి- సూళ్లూరుపేట: ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15వ తేదీ తిరుపతి కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి, 18వ తేదీ నిర్వహించనున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని ఏపీ ఆటో రాష్ట్ర కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మందికి రవాణా రంగం ఉపాధి కల్పిస్తోందని వాటిలో ఆటోల ద్వారా ఉపాధి పొందుతున్న కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం కనికరం లేదని, ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడ్డాక స్త్రీ శక్తి మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులు వీధిన పడ్డారని, పట్టణ గ్రామీణ ప్రాంతాలలో ఉద్యోగ ఉపాధి లేక నిరుద్యోగ యువకులు ఉన్నత చదువులు చదివి ఆటో డ్రైవర్ గా మారుతున్నారని, వచ్చిన ప్రభుత్వాలు వీరికి ఉద్యోగ అవకాశాలు కల్పించలేకపోవడం ద్వారా అప్పులతో ఆటోలు కొనుగోలు చేసుకుని కుటుంబాలు పోషించుకుంటున్నారన్నారు. అలాంటి ఆటో కార్మికుల వారిపై ప్రభుత్వాలు పెట్రోలు, డీజిల్ రేట్లు పెంచి ప్రైవేట్ ఫైనాన్సర్లు అధిక వడ్డీలు దోపిడీకి ఆటో కార్మికులు బలవుతున్నారని తెలిపారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, జీవో నెంబర్ 21ను, రద్దు చేయాలని కోరుతూ ఈ నెల15వ తేదీ తిరుపతి కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలు జయప్రదం చేయాలని ఏపీ ఆటో రాష్ట్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.



గణాంక విభాగంలో ధార్మిక ఉపన్యాసం

ప్రజాశక్తి - క్యాంపస్:

గణాంకాల శాఖ ఏర్పడి 105వ జన్మదినోత్సవం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని గణాంకశాస్త్రం విభాగం సిడినాయుడు, ఆర్కాట్ లక్ష్మీకాంతమ్మ ఎండోమెంట్ బుధవారం ఉపన్యాసం నిర్వహించారు. ఇన్‌చార్జీ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. "క్వాంటం కంప్యూటింగ్‌లో గణాంక భావనలు" అనే అంశంపై తిరుపతిలోని ఐఐటి ఆచార్యులు వి.వి.రావు ఎండోమెంట్ ఉపన్యాసాన్ని ఇచ్చారు. గణాంకాల విభాగాధిపతి ఆచార్య బి.సరోజమ్మ గణాంకాలలో సి.ఆర్.రావు చేసిన కృషి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్లు పి. బాలసిద్ధముని, కోదండరామి రెడ్డి, గణితశాస్త్ర విభాగం ప్రొఫెసర్లు జయ సుబ్బారెడ్డి, భారతి,సుగుణమ్మ, రాజనీతి శాస్త్ర విభాగం ప్రొఫెసర్ బివి. మురళీధర్, అకడమిక్ కన్సల్టెంట్లు రామకృష్ణ, నరేష్, పి. విష్ణు ప్రియ, కె. నాగవిహారి, పరిశోధకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఓరియంటేషన్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో బి టెక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్, ఇండక్షన్ ప్రోగ్రామ్ శ్రీనివాసం ఆడిటోరియంలో బుధవారం ముగిసింది. వారం రోజులుపాటు విద్యార్థులకు వృత్తిపరమైన అభివృద్ధి, ఒత్తిడిని తగ్గించే సాధనంగా సంగీతం, మిమిక్రీ, విద్యా నైపుణ్యానికి పోషకాహార అవసరం మొదలైన వాటిపై వివిధ సెషన్లలో బోధించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య జి. శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. డి. వి. సుబ్బారావు, డీన్ ఆచార్య కె.మల్లికార్జునరావు, సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సు డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. నారాయణ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు మండలం కొలమాసనపల్లి ప్రభుత్వ హైస్కూలులో ఉపాధ్యాయ దినోత్సవం, క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాలను బుధవారం గనంగా నిర్వహించారు. క్రీడలలో పాల్గొన్న 200 మంది క్రీడాకారులకు మొదటి రెండవ బహుమతులు బంగారు పతకాలు, పలమనేరు శ్రీపురం సీతారామయ్య నాగమణి చారిటబుల్ ట్రస్ట్ వారు అందించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపల్లి నరేంద్రబాబు శ్రీపురం సీతారామయ్య ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యత ఇవ్వండి

డ్వామా పీడీ రవికుమార్

ప్రజాశక్తి- రామకుప్పం: ఉపాధి హామీ ద్వారా మండలంలో భూగర్భ జలాలు అభివృద్ధికి, వృక్షాల పెంపునకు ప్రాధాన్యత ఇవ్వాలని డ్వామా పీడీ రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక శ్రీ శక్తి భవనం వద్ద బుధవారం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఉపాధి హామీ పనులు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఏప్రిల్ ఒకటి 2024వ సంవత్సరం నుండి మార్చి 31 వరకు 2025వ సంవత్సర వరకు 32,19,10,791 కోట్ల రూపాయల పనులు జరిగాయన్నారు. గత 20 రోజులుగా సామాజిక తనిఖీ బృందం పనులను గ్రామాల్లో పర్యవేక్షించారు. ఇందులో 2,66, 801 రూపాయలు రికార్డులు సక్రమంగా లేని కారణంగా జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి, ఆంజనేయ రెడ్డి , రామ్మూర్తి,గుర్రప్ప, వెంకట్రామయ్య గౌడ్, కృష్ణా నాయక్ ,కామరాజు నాయక్ జైయి, పెరుమాళ్, మనోహర్, గజేంద్ర, భాస్కర్, యాసర్పి, డిఆర్పీలు, ఏపీ ఓ గణేష్, సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరులోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి నాయకత్వంలో విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగరి ప్రాంతానికి చెందిన స్వచ్ఛంద సంస్థ సహకారంతో హెచ్ఐవి, ఎయిడ్స్ గురించి సరైన సమాచారం అందించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ గురించి అపోహలు తొలగించి, సరైన సమాచారం పొందడం ద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, ఇతరులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ నిర్వాహకురాలు కలైవాణి, ఆరోగ్య కార్యకర్తలైన సుమీ, భూషణశ్వరి, అరుణ, పెస్సు రావణ్య, నరేష్, ప్రియ పాల్గొన్నారు.



ఆందోళన చేపట్టిన మహిళలు

బ్రాందీ షాపు మార్చేయండి..

మహిళల నిరసన

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి వైకుంటపురం నుంచి తుమ్మలగుంట వైపు వెళ్లే రోడ్డు మార్గంలో విక్టరీ బార్ అండ్ రెస్టారెంట్ దగ్గర స్థానిక మహిళలు ' ఇక్కడ బ్రాందీ షాపు వద్దు' అని పెద్ద ఎత్తున బుధవారం నిరసన తెలిపారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన బార్ అండ్ రెస్టారెంట్లకు సంబంధించిన టెండర్లలో విక్టరీ బార్ అండ్ రెస్టారెంట్‌కి ఎలాంటి టెండర్ రాక పోవడంతో వారు తిరుపతిలోని మరొక ప్రదేశంలో ఉన్న మద్యం షాపును బార్ వున్న ప్రదేశానికి మార్చివేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోనూ ఇక్కడ బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేసేటప్పుడు ఇలానే తాము నిరసన తెలిపారని పేర్కొంటున్నారు. ఇది మెయిన్ రోడ్ కావడం వల్ల మహిళలు విద్యార్థిని విద్యార్థులు ఈ బార్ అండ్ రెస్టారెంట్ వల్ల గతంలో చాలా ఇబ్బందులు పడ్డారని స్థానికులు తెలుపుతున్నారు. ఇప్పుడు బార్ లేదు అన్న సంతోషాన్ని కనీసం రెండు రోజులు కూడా లేకుండా మరొక మద్యం షాపును ఇక్కడ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు సాగిస్తున్నారని తెలుసుకొని వాళ్లు నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రదేశంలో మళ్లీ బ్రాందీ షాపును ఏర్పాటు చేస్తే కచ్చితంగా మహిళలందరూ కలిసి నిరాహార దీక్ష చేస్తామని స్థానిక మహిళలు హెచ్చరించారు.

బిఆర్ నాయుడు సైన్యం పెత్తనమా?: కరుణాకర్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుమల శ్రీవారి ఆలయం పై టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు సైన్యం పెత్తనం చెలాయించేలా వ్యవహరిస్తున్నారని, ఇది సరైంది కాదని మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. పద్మావతి పురంలోని కరుణాకర్ రెడ్డి నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల చంద్రగ్రహణం రోజు ఆయన సంస్థలో పనిచేసే ఓ ఉద్యోగి తిరుమల శ్రీవారి ఆలయంలోని గేట్లు స్వయంగా వేస్తున్న ఫొటోలు వైరల్ అయ్యాయని గుర్తు చేశారు. బి ఆర్ నాయుడు ప్రధాన అనుచరుడు ఆలయం లోపల డిప్యూటీ స్థాయి అధికారిలా వ్యవహరిస్తూ 'స్వామి దర్శనాలు చేసుకోండి, కళ్లు మూసుకోండి.. కర్పూర హారతి తీసుకోండి..' అంటూ నిత్యం పెత్తనం చెలాయిస్తున్న విషయం నిజం కాదా?' అని ప్రశ్నించారు. సాక్షాత్తు చైర్మన్ కుమారుడు జూబ్లీహిల్స్ సొసైటీ పేరుతో ఇల్లు స్థలాలు ఇస్తామని సుమారు రూ.90 కోట్లు కాజేశారని మరో రూ.500 కోట్లపై కన్నెస్తే సొసైటీ పెద్దనిమిదిన్నర లక్షలు జరిమానా విధించారని గుర్తు చేశారు. చైర్మన్ సైన్యం విదేశాల్లో సైతం స్వామివారి కల్యాణోత్సవాలు స్వయంగా నిర్వహిస్తూ వాటికి ధరలు నిర్ణయించి, భక్తులు వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని ఇది ఎవరు జేబులు నింపుకోవడానికో చైర్మన్ సమాధానం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో నగర మేయర్ డాక్టర్ శిరీష, వైసిపి నాయకులు పాల్గొన్నారు.